# సాఫ్ట్ స్కిల్స్

బడిలో నేర్పని పాఠాలు

డా॥ బి.వి. పట్టాభిరామ్ Ph.D

ఎమెస్కో

# ఇందులో...


| | | |
|---|---|---|
| 1. | లలిత నైపుణ్యాలు | 11 |
| 2. | మీ గురించి మీరేమనుకుంటున్నారు? | 15 |
| 3. | స్పష్టంగా లేని లక్ష్యం ఓ పగటి కల మాత్రమే | 19 |
| 4. | ఆత్మవిశ్వాసం | 23 |
| 5. | స్వీయగౌరవం | 27 |
| 6. | కంఫర్ట్ జోన్ | 33 |
| 7. | జీరోలు కాదు హీరోలు | 39 |
| 8. | మొహమాటం వద్దు - మొదటికే మోసం | 47 |
| 9. | కమ్యూనికేషన్స్ | 53 |
| 10. | నిర్ణయాలు తీసుకోవటం ఓ కళ | 57 |
| 11. | ఎమోషనల్ ఇంటెలిజెన్స్ | 61 |
| 12. | మీ సృజనాత్మకత ఎంత? | 67 |
| 13. | జ్ఞాపకశక్తి కథా... కమామీషూ... | 71 |
| 14. | ఏకాగ్రత | 77 |
| 15. | ప్రేరణ | 81 |
| 16. | సమస్యల పరిష్కారం | 85 |
| 17. | పబ్లిక్ స్పీకింగ్ | 91 |
| 18. | స్ట్రెస్ మేనేజ్‌మెంట్ | 97 |
| 19. | టీమ్ బిల్డింగ్ | 105 |
| 20. | మీరు అంతర్ముఖులా, బహిర్ముఖులా? | 109 |
| 21. | భయాలు, భీతులు | 115 |
| 22. | ఆత్మహత్య పరిష్కారం కాదు | 121 |
| 23. | విద్యతో పాటు విలువలు | 127 |
| 24. | ఇంటర్వ్యూలో విజయం | 133 |
| 25. | అఫర్మేషన్ (స్వగతం-సజెషన్లు) | 141 |



# 1. లలిత నైపుణ్యాలు

## (SOFT SKILLS)

భారతదేశం వృత్తివిద్యలకు పట్టుగొమ్మ అయింది. మనకు వేలాది ఇంజినీరింగు కాలేజీలు, ఫార్మసీ కాలేజీలు, ఇతర వృత్తివిద్యా కాలేజీలు వున్నాయి. ఏటా లక్షలాది విద్యార్థులు ప్రొఫెషనల్ డిగ్రీలు సంపాదిస్తున్నారు. కాని వారిలో మంచి ఉద్యోగాలు పొందుతున్నవారు చాలా తక్కువే అని చెప్పాలి. తక్కినవారంతా మరో డిగ్రీకోసం చదువు కొనసాగించటమో, చిన్నా చితకా ఉద్యోగాలలో కుదురుకోవటమో, లేక తమ చదువుకు సంబంధంలేని ఇతర వృత్తులకు తరలిపోవటమో చేస్తున్నారు.

కారణమేమిటో చెప్పనక్కర్లేదు. బహుశా ఈ విద్యార్థులంతా వృత్తివిద్యను ఏ విధంగా నేర్చుకోవలసివుందో ఆ విధంగా నేర్చుకునే అవకాశాన్ని పొంది వుండలేదు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల తీరు వేరు – పుస్తకం బట్టీపట్టి మంచి గ్రేడ్‌లు సంపాదించవచ్చు. కాని వృత్తివిద్యా కోర్సులలో తీరు అలా వుండకూడదు. ఇక్కడ లలిత నైపుణ్యాలు (Soft Skills) ఓ ప్రధానపాత్ర నిర్వహిస్తాయి. వీటిని సంక్షిప్తంగా దిగువ పేర్కొన్నట్లు A B C D E F G అని చెప్పవచ్చు.

A = Attitude Change (దృక్పథంలో మార్పు)

B = Behavioural Modification (ప్రవర్తనలో సవరణలు)

C = Creativity (సృజనాత్మకత)

D = Discipline (క్రమశిక్షణ)

E = Effective Communication (చక్కని భావవ్యక్తీకరణ)

F = Focus (దృష్టి కేంద్రీకరణ)

G = Goal Setting (లక్ష్యాలు పెట్టుకోవటం)

గ్లోబల్ టెక్నాలజీ మార్కెట్ రంగంలో మన భారతదేశం అపూర్వమైన అభివృద్ధిని సాధించి టెక్నాలజీ నైపుణ్య విభాగంలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సృష్టించుకుంది. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశాల్లో ఒకటి మాత్రమేగాక ప్రపంచంలో యువజనులు అత్యధికంగావున్న దేశాల్లోకూడా ఒకటిగా వుంది.

దేశవ్యాప్తంగా గ్రాడ్యుయేట్లకు లక్షల్లో కాకున్నా వేలల్లో ఉద్యోగాలు వున్నాయని అంచనా. ఇందులో దురదృష్టకరమైన విషయమేమంటే మన కాలేజీలనుంచి గ్రాడ్యుయేట్లుగా బయటకు వస్తున్నవారి సామర్థ్యానికి, తమ వృత్తికి అవసరమైన సామర్థ్యానికి మధ్య విపరీతమైన అంతరముందని అత్యధిక కంపెనీలు అభిప్రాయ పడుతున్నాయి.

ఉదాహరణకు దేశంలోని ఒక సాఫ్ట్‌వేర్ దిగ్గజానికి చెందిన మానవ వనరుల బృందంవారు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 15,000 ఉద్యోగ ఖాళీలు వున్నట్లు ప్రకటించారు. ఆ ఉద్యోగాలకు 63,000 దరఖాస్తులు రావటంతో వారు సంతోషించారు. తీరా వాటిని పరిశీలిస్తే బయోడాటా (రెజ్యుమె) లలోని ఇంగ్లీషు వాక్య నిర్మాణం కూడా సరిగ్గాలేక స్పెల్లింగు తప్పులు వాటికి తోడై తప్పుల తడకలుగా వుండటంతో, దాదాపుగా మొత్తం దరఖాస్తులను వారు తిరస్కరించవలసివచ్చింది. దీనితో అటు కార్పొరేట్లలోనూ, ఇటు విద్యార్థుల్లోను కూడా నిరాశానిస్పృహలు అలుముకుంటున్నాయి.

## ఆరోగ్యం అంటే ఏమిటి?

"ఆరోగ్యమంటే జబ్బులు, లోపాలు లేకపోవటం మాత్రమే కాదు, ఒక సంపూర్ణమైన శారీరక, మానసిక, సామాజిక కుశల స్థితి" అని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఆరోగ్యాన్ని నిర్వచించింది. మన యువ గ్రాడ్యుయేట్లు శారీరకంగాను, మానసికంగాను

ఆరోగ్యవంతులే కాని సామాజిక ఆరోగ్యంలో మాత్రం వెనుకబడి వుంటున్నారు. సామాజిక ఆరోగ్యంలో పరస్పర సంబంధాలు, భావప్రసారాలు మరెన్నో కూడా వున్నాయి. ప్రత్యేకించి ఇతరులతో ఇంగ్లీషులో వ్యవహరించ లేకుండావున్నారు. అగ్నికి ఆజ్యంతోడైనట్లు విపరీతమైన న్యూనతాభావాలు, సాధారణ భయాలు, ఫోబియాలు వారిని పీడిస్తున్నాయి.

## వ్యక్తిత్వ వికాసం

ప్రవర్తన సంబంధమైన సమస్యలను, నెగిటివ్ వైఖరులకు సంబంధించిన సమస్యలను అధిగమించటానికి ఒకే ఒక సాధనం వ్యక్తిత్వ వికాసం.

భారతదేశంలో విద్యాసంస్థలు వ్యక్తిత్వ వికాసం సబ్జెక్టును కీలక పాఠ్యాంశాల్లో భాగంగా ప్రవేశపెట్టవలిసిన సమయం ఆసన్నమైంది. ఇందులో కమ్యూనికేషన్, నాయకత్వ నైపుణ్యాలు, టీమ్ వర్కు, ప్రేరణ, సృజనాత్మకత, దృష్టికేంద్రీకరణ, గోల్ సెట్టింగ్ మొదలైనవి వుంటాయి. కాలేజీ ప్రాంగణాల్లో ఇంగ్లీష్ మాట్లాడటం తప్పనిసరి చేయవలసిన అవసరముంది. ఇలా విద్యార్థుల అమ్ములపొదిలోకి సరియైన సాధనాలను సమకూర్చటం ద్వారా వారు స్వయంగా విజయాలు సాధించటానికి, తద్వారా జాతికి విజయం చేకూరేందుకు దోహదం చేసినవారమవుతాం.

## విద్యార్థులకు కొన్ని సూచనలు

★ కాలేజికి 65% హాజరు మాత్రమే తప్పనిసరి అని, విద్యార్థులనుంచి ఆశిస్తున్నదదేనని మేనేజిమెంట్లు ప్రకటించటం అందరికీ తెలిసిందే. అంటే తక్కిన 35% ముఖ్యంకాదని అర్థం తీసుకోకూడదు. అనివార్యమైన కారణాలవల్ల హాజరుకాలేని కొద్దిమంది పరిస్థితులను దృష్టిలో వుంచుకొని ఈ 65% నియమం పెట్టారు. అయితే విద్యార్థులు దీనినొక మిషగా తీసుకొని తరగతులు ఎగగొడుతున్నారు. వాస్తవానికి మెడికల్ సర్టిఫికెట్లవంటి సాధనాలతో అదనంగా మరో 10% హాజరుకు కూడా ఎగనామం పెడుతున్నారు. ఈ మెడికల్ సర్టిఫికెట్లు బోగస్ అని మేనేజిమెంటుకు బాగానే తెలుసు. మొత్తం మీద తాను 45% డుమ్మా కొట్టగలిగానని విద్యార్థి / విద్యార్థిని సంతోషించవచ్చునేమో గాని నిజానికి ఇక్కడ నష్టపోతున్నదెవరో వారు కొంచెం ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరముంది.